14-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - కర్మ, అకర్మ, వికర్మల గతులను ధ్యానములో ఉంచుకుంటూ ఈ కర్మేంద్రియాల ద్వారా ఏ పాప కర్మలనూ చేయకండి, దానమును ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది"

ప్రశ్న:- ఏ విషయములో బ్రహ్మాబాబాను ఫాలో చేసే పిల్లలు భవిష్యత్తులో సింహాసనాధికారులవుతారు?

జవాబు:- ఏ విధముగా బ్రహ్మాబాబా దేహ సహితముగా పూర్తిగా బలిహారమయ్యారు, తమ సర్వస్వాన్ని ఈశ్వరార్థము పిల్లల సేవలో సమర్పణ చేసారు, డైరెక్ట్ గా ఇన్స్యూర్ చేసారు, అందుకే విశ్వ రాజ్యాధికారము లభించింది, అలాగే ఫాలో ఫాదర్ చేయండి. సుపుత్రులుగా అయ్యే సర్టిఫికెట్ ను తీసుకోవాలి, స్వంత పిల్లలుగా అయి తనువు, మనస్సు, ధనముల ద్వారా సేవ చేయాలి, తండ్రికి పూర్తి సహాయకులుగా అవ్వాలి. సర్వస్వాన్ని ఇన్స్యూర్ చేసి 21 జన్మల రాజ్యానికి హక్కుదారులుగా అవ్వగలరు.

పాట:- బాల్యపు రోజులను మర్చిపోకండి... (బచ్పన్ కే దిన్ భులా నా దేనా...)

ఓం శాంతి. మధురాతి మధురమైన పిల్లలు పాటను విన్నారు. ఇప్పుడు పిల్లలు జీవిస్తూనే ఈ ప్రపంచము నుండి మరణించి ఆ ప్రపంచములోకి వెళ్ళేందుకు తండ్రి ఒడిని తీసుకున్నారు. ఏ తండ్రి? పరమపిత పరమ ఆత్మ అనగా పరమాత్మ. అర్థం చేయించేటప్పుడు ఎప్పుడూ - బాబా జ్యోతిర్లింగము, అపారమైన జ్యోతి స్వరూపుడు, వేలాది సూర్యులకన్నా తేజోమయుడు అని అనకండి. అలా అనడం వాస్తవానికి తప్పు. మరి ఏమనాలి? పరమపిత పరమాత్మ అనగా పరమ ఆత్మ, వారు సదా పరంధామంలో ఉంటారు. పరమ్ అనగా ఉన్నతోన్నతమైన నిరాకార తండ్రి. వారు ఆత్మలందరి తండ్రి, అందుకే వారిని సుప్రీమ్ అని అంటారు. వారు జనన-మరణ చక్రములోకి రారు. వారు అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఒకవేళ నేను కూడా జనన-మరణాల చక్రములోకి వస్తే ఇక అందరి ఉద్ధరణ ఎవరు చేస్తారు? నేనే వచ్చి అందరినీ దుఃఖాల నుండి దూరంగా తీసుకువెళ్తాను. దుఃఖహర్తను మరియు సుఖాన్ని ఇచ్చేవాడిని నేనే, కానీ నా గురించి తెలియదు. భక్తి మార్గములో - ఓ పరమపిత పరమాత్మా అని గానం చేస్తూ ఉంటారు. వారు తండ్రి అని తప్పకుండా అర్థం చేసుకుంటారు. కానీ, ఆ తండ్రి ఎవరు, ఎలా ఉంటారు - ఇది తెలియదు. వారిది మనుష్యులవంటి రూపమైతే కాదు. బ్రహ్మ, విష్ణు, శంకరులను కూడా తలచుకుంటారు. వారు చూడడానికి ఈ కనులకు కనిపిస్తారు. కానీ వీరు (శివుడు) ఎవరు అన్నది తెలియదు. శివుని మందిరాలకు వెళ్తారు కానీ వారిని ఎందుకు తలచుకుంటారు, ఇది తెలియదు.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు, దేవీ-దేవతలు వామ మార్గంలోకి వచ్చినప్పుడు సోమనాథ ఆలయాన్ని తయారుచేస్తారు. శివుడు తండ్రి అన్నంతవరకు అర్థం చేసుకుంటారు కానీ, వారు స్వర్గ రచయిత, వారు మనల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు అన్నది వారికి తెలియదు. ఒకవేళ తెలిసి ఉంటే ఇతరులకు కూడా శివబాబా చరిత్రను తెలియజేసి ఉండేవారు. అలా తెలియకుండా ఉండడమే డ్రామాలో నిశ్చితమై ఉంది. తెలుసుకోవడము అనగా వారసత్వాన్ని పొందడము. తెలుసుకోకపోవడము అనగా వారసత్వాన్ని పోగొట్టుకోవడము. తండ్రి అంటారు, స్వర్గ రచయితనైన నేను మీకు సుఖాన్ని ఇస్తాను, పావనంగా తయారుచేస్తాను. మళ్ళీ పంచ వికారాలు మిమ్మల్ని పతితముగా చేస్తాయి. కళలు తగ్గిపోతూ ఉంటాయి. మీరు నల్లగా అయిపోతారు. మొదట మీరు 16 కళల సంపూర్ణ చంద్రుని వలె ఉండేవారు, పావనముగా ఉండేవారు, ఇప్పుడు మీకు గ్రహణం పట్టింది. బాబా అంటారు, దానము ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది. పంచ వికారాలనే గ్రహణము అని అంటారు. వాటి ద్వారా ఆత్మలైన మీరు దుఃఖితులుగా, నల్లగా అవుతారు. తండ్రి అంటారు, నేను బ్రాహ్మణులైన మీ తండ్రిని. హే బ్రాహ్మణులారా, మీ వద్ద ఈ పంచ వికారాలేవైతే ఉన్నాయో వీటిని నాకు దానముగా ఇచ్చినట్లయితే మీ గ్రహణము తొలగిపోతుంది. ఈ రోజు నుండి దానమిచ్చి మళ్ళీ వాటితో ఇంకెప్పుడూ ఏమీ చేయకండి. మాయ తుఫానులైతే ఎన్నో వస్తాయి కానీ కర్మేంద్రియాలతో క్రోధము మొదలైనవి చేసినట్లయితే పాపము అవుతుంది. కర్మ-అకర్మ-వికర్మల గతులను కూడా మీకు అర్థం చేయిస్తాను. మీ కర్మలు వికర్మలుగా అవ్వకూడదు. నేను పిల్లలైన మిమ్మల్ని వికర్మాజీతులుగా తయారుచేస్తాను. ఇది రాహు గ్రహణము. దానము ఇచ్చినట్లయితే గ్రహణము తొలగిపోతుంది. తండ్రి అంటారు - నా మధురమైన పిల్లలూ, ఈ ఐదు భూతాలను దానం ఇవ్వండి, ఇందులో ధనం మొదలైనవాటి విషయమేదీ లేదు. వీరు తండ్రి, మీరు స్వంత

పిల్లలు. తండ్రి తమ స్వంత పిల్లలకు తప్పకుండా సహాయం చేయవలసిందే. మీరు కూడా తనువు, మనస్సు, ధనములతో సేవ చేస్తారు. తండ్రికి కూడా మీ సేవను చేసే బాధ్యత ఉంది. తండ్రి అంటారు - ఈ సర్వస్వమూ పిల్లలైన మీదే. భక్తి మార్గములో మీరు భగవంతునికి ఇస్తూ వచ్చారు. కానీ ఈశ్వరుడేమైనా ఆకలితో ఉన్నారా. అక్కడ మీరు ఇన్స్యూర్ చేసుకుంటారు. ఈశ్వరునికి ఇవ్వడం ద్వారా ఈశ్వరుడు మళ్ళీ మరుసటి జన్మలో మీకు ఇస్తారు. ఇది ఇన్స్యూర్ చేసుకోవడమే అయ్యింది కదా. మరుసటి జన్మలో దీని ఫలము లభిస్తుంది. ఈశ్వరుడు దాత. ఇప్పుడు మీరు 21 జన్మల కొరకు స్వయాన్ని ఇన్స్యూర్ చేసుకుంటారు. వారు ఒక్క జన్మ కొరకు ఇన్స్యూర్ చేసుకుంటారు. ఇక్కడ 21 జన్మల కొరకు సర్వస్వమూ ఇన్స్యూర్ అవుతుంది. కొడుకు తండ్రిని ప్రత్యక్షము చేస్తాడు అని అంటారు. చూడండి, తండ్రి అయిన బ్రహ్మాబాబా వద్ద ఏదైతే ఉండేదో, దానినంతా ఈశ్వరార్థము పిల్లల సేవలో వినియోగించారు, శివబాబాను వారసునిగా చేసుకున్నారు, తనువు, మనస్సు, ధనము సర్వస్వమునూ ఇచ్చేసారు, దానికి ప్రతిఫలముగా తమ పురుషార్థము ద్వారా విశ్వ రాజ్యాధికారము లభిస్తుంది ఎందుకంటే ఇది డైరెక్ట్ కదా. మీరు నాకు చెందినవారిగా అవ్వడం ద్వారా 21 జన్మలు స్వర్గాధిపతులుగా అవుతారు కానీ ఎంతగా బలి అవుతారో అంతగా వారసత్వం లభిస్తుంది. దేహ సహితముగా సర్వస్వాన్ని బలి చేయాలి. ఎవరైతే మాత, పితలను ఫాలో చేస్తారో వారే సింహాసనముపై కూర్చుంటారు. కావున తండ్రి అంటారు, దానం ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది. దానము ఇచ్చి మళ్ళీ ఒకవేళ తిరిగి తీసుకున్నట్లయితే దుర్గతినే పొందుతారు. పూర్తి పురుషార్థము చేయాలి. పురుషార్థులైన విద్యార్థులు బాగా చదివినట్లయితే నంబరు కూడా తీసుకుంటారు. మీరు కూడా పురుషార్థము చేసి ఉన్నతమైన నంబరును తీసుకోండి. ఇందులో కష్టతరమైన విషయమేమీ లేదు, కేవలం పవిత్రముగా ఉండాలి. దీని కొరకు బాబా నుండి బలము కూడా లభిస్తుంది. సంతోషపు పాదరసము కూడా పైకి ఎక్కుతుంది.

మనము దేవతలుగా అవ్వాలి కావున ఏ అవగుణాలు ఉండకూడదు. 16 కళల సంపూర్ణులుగా, సంపూర్ణ నిర్వికారులుగా ఇక్కడే తయారవ్వాలి కావున ఏ అవగుణమూ ఉండకూడదు. అర్ధకల్పం వికారులుగా అయ్యారు, కావున మాయ కూడా అంటుంది - ఇప్పుడు వీరు నిర్వికారులుగా అవుతారా, నేను మళ్ళీ వీరిని వికారులుగా తయారుచేస్తాను అని. మాయతో ఈ విధంగా యుద్ధం కొనసాగుతుంది. ఇందులోనే కష్టం ఉంది. మాయపై విజయము పొందాలి. వారేమో దీనిని హింసాయుత యుద్ధముగా చూపించి ఖండితము చేసేసారు. మీరు మాయపై విజయాన్ని పొందడం ద్వారా విశ్వాధిపతులుగా అవుతారు. తండ్రికి పంచ వికారాల దానమును ఇవ్వకపోతే శ్రీనారాయణుడిని లేక లక్ష్మిని వరించలేము అని పిల్లలు భావిస్తారు. కావున పిల్లలైన మీరు హృదయమనే దర్పణములో చూసుకోవాలి - నేను కర్మేంద్రియాలతో ఏమీ చేయలేదు కదా? మాయ తుఫానులైతే ఇంతకుముందు కన్నా తీవ్రంగా వస్తాయి. వైద్యులు మందు ఇచ్చేటప్పుడు, ఇంతకుముందు ఉన్న పాత రోగము బయటకు వస్తుంది, ఇందులో భయపడకూడదు, అది అలాగే వస్తుంది అని చెప్తారు. వీరు కూడా సర్జన్ యే. వీరు అంటారు, మీరు నా పిల్లలుగా అయినట్లయితే మీకు రావణుని యుద్ధము ఎంతగానో జరుగుతుంది. మాయ ఎంతగానో దాడి చేయడం మొదలుపెడుతుంది, అందుకే తుఫానులకు భయపడకూడదు. తండ్రికి చెందినవారిగా అయ్యారు కావున ఈ బాల్యాన్ని మర్చిపోకండి. ఇది ఈశ్వరీయ బాల్యము. ఈశ్వరుని ఒడిలోకి ఒక్కసారి వస్తే తర్వాత దేవతల ఒడిలోకి 21 సార్లు వెళ్తారు. ఈశ్వరీయ జన్మ తర్వాత మీరు స్వర్గములోకి వెళ్తారు. సర్టిఫికెట్ తీసుకోవాలి. బాబా, నేను మీ సుపుత్రుడినా లేక కుపుత్రుడినా? అప్పుడు బాబా తెలియజేయగలరు - మీరు సుపుత్రులలో కూడా ఏ నంబరులో ఉన్నారు, ఏ లోపాలు ఉన్నాయి, ఇది బాబా తెలియజేయగలరు. మేము సేవ చేయకపోతే అంతటి ఉన్నతమైన పదవిని ఎలా పొందగలము అని స్వయము కూడా అర్థం చేసుకోగలరు. అచ్చా, బాబా అంటారు, మీరు ఒక పని చేయండి, ఒక హాస్పిటల్ లేక కాలేజిని తెరవండి. మీరు అందులోకి వెళ్ళకపోయినా కానీ, ఇతరులు చాలామంది అందులో ఆరోగ్యాన్ని పొందితే దాని బహుమానము మీకు లభిస్తుంది. మనుష్యులు ధర్మశాలలను తయారుచేస్తారు ఎందుకంటే అక్కడకు ఎంతోమంది వచ్చి విశ్రాంతిని పొందితే మరుసటి జన్మలో తమకు మహలు లభిస్తుందని భావిస్తారు. బాబా వద్దకు ఎందరో వస్తారు - ఈ హాస్పిటల్ ను తెరవండి, మేము సహాయం చేస్తాము అని అంటారు. పెద్ద హాస్పిటల్ తెరవండి. ఒకవేళ జ్ఞానము తీసుకునేందుకు స్వయానికి తీరిక లేకపోతే, అచ్చా, మూడడుగుల భూమిని తీసుకుని ఈ హాస్పిటల్ మరియు కాలేజీని తెరవండి. హాస్పిటల్ ద్వారా సదా ఆరోగ్యవంతులుగా అవుతారు. కాలేజీ ద్వారా సదా ఐశ్వర్యవంతులుగా అవుతారు. చాలామంది వచ్చి అలా తయారైతే మీకు పుణ్యము లభిస్తుంది. అందులో పెద్ద ఖర్చు కూడా ఏమీ ఉండదు. ఈ రోజుల్లో ఎంత ధనము సంపాదిస్తూ ఉంటారు, కోట్లకు ఆసాములుగా ఉన్నారు. అదంతా వారి పుత్రులు, మనవలు తింటారా? ధూళి కూడా మిగలదు, అంతా వినాశనమైపోతుంది. రాజ్యము పేదవారికి లభిస్తుంది. పేదల పాలిటి పెన్నిధి కదా. ఈ బాబా నంబరు వన్ సాధారణమైనవారిగా ఉండేవారు. ఒక వేయి లేక రెండు వేలు ఉంటే వారిని పేదలు అని అంటారు. ఇక్కడ

పేదవారు కూడా మంచి పదవిని పొందగలరు. ఎవరిపైనా లక్షలు, కోట్లు తీసుకొని ఏమి చేసుకుంటాము? పేదల పైస, పైసతోనే స్థాపన చేస్తారు. గాంధీకి ఎంతగా దానం చేసేవారు, అందులో ఎంతమంది మరణించారు! ఎన్ని కష్టాలను సహించారు! మీకైతే ఏ కష్టమూ లేదు. తండ్రి అంటారు, మీరు మొదట రాజయోగాన్ని నేర్చుకోండి, అప్పుడు మీకు రాజ్యాన్ని ఇస్తాను. ఈ రాజ్యమైతే మృగతృష్ణ (ఎండమావులు) వంటిది. ఒక కథ కూడా ఉంది కదా - ద్రౌపది దుర్యోధనునికి ఆహ్వానమును ఇచ్చింది, అతను వచ్చినప్పుడు అది ఒక సరస్సుగా భావించి వస్త్రాలు తీయడం మొదలుపెట్టాడు, అప్పుడు ద్రౌపది - అంధుని పుత్రుడైనా అంధుడా, ఇదంతా ఎండమావి (మృగతృష్ణ) వంటిది అని చెప్పింది. అందరూ - మేము స్వరాజ్యాన్ని పొందాము అని భావిస్తారు, కానీ ఎంత దుఃఖము ఉంది! ప్రజలు ఎంత దుఃఖితులుగా ఉన్నారు, మృత్యువు ముందు నిలబడి ఉంది. తండ్రి అంటారు, వీరంతా మరణించే ఉన్నారు, ఇది స్మశానవాటిక, దీనిని మీరు మళ్ళీ పరిస్తాన్ గా తయారుచేయాలి. వజ్ర-వైఢూర్యాలతో పొదగబడిన మహళ్ళను తయారుచేస్తారు. ఇక్కడైతే ఇది రాతిపురిగా ఉంది, అక్కడ స్వర్ణిమపురి ఉంటుంది, అందుకే తండ్రి అర్థం చేయిస్తారు - దానం ఇచ్చినట్లయితే గ్రహణం తొలగిపోతుంది, అప్పుడు 16 కళల సంపూర్ణులుగా అవుతారు. ఇప్పుడు మీరు పతితులుగా ఉన్నారు, మనుష్యులు ఎంత దుఃఖితులుగా ఉన్నారు. యుద్ధం ప్రారంభమైతే నిద్ర దూరమైపోతుంది. విశ్రాంతి కలుగదు, నిద్ర మాత్రలు తీసుకుని నిద్రపోతారు. ఇది ఉన్నదే రావణ రాజ్యము. ఇప్పుడు దసరా నాడు రావణుడిని కాలుస్తారు, ఇలా అంతిమం వరకు కాలుస్తూనే ఉంటారు, వినాశనమయ్యేంతవరకు కాలుస్తారు. వినాశనం తర్వాత ఇక రావణుడు కాలడు. మళ్ళీ ద్వాపరము తర్వాత కాల్చేందుకు రావణుడిని తయారుచేస్తారు. ప్రతి సంవత్సరము రావణుడిని కాలుస్తారు, కానీ అతను మరణించనే మరణించడు. ప్రతి సంవత్సరము మీరు రక్షాబంధనాన్ని జరుపుకుంటారు, రాఖీని కడతారు, మళ్ళీ అపవిత్రముగా అయిపోతారు.

లక్ష్మీ-నారాయణుల వద్ద ఎంత అపారమైన ధనము ఉండేది! వారి పూజ ఎంతగా జరుగుతుంది! పూజ కేవలం లక్ష్మికి మాత్రమే చేయరు, చతుర్భుజునికి చేస్తారు. అందులో ఇరువురూ వచ్చేస్తారు. లక్ష్మితోపాటు నారాయణుడు కూడా తప్పకుండా ఉండాలి, అందుకే ఇరువురి పూజను చేస్తారు. జోడి లేకుండా పని ఎలా అవుతుంది? ప్రవృత్తి మార్గం కదా. మీరు విశ్వాధిపతులుగా అవుతారు. దీపావళి నాడు లక్ష్మిని పూజించకపోతే మీ వద్దకు ధనము రాదు అని అందరూ అంటున్నారు - అని పిల్లలు అడుగుతారు. అందుకే బాబా సలహా ఇస్తారు - పిల్లలూ, ఇందులో కూడా సాక్షిగా అయి పాత్రను అభినయించండి, లేకపోతే గొడవ జరుగుతుంది. ఉదాహరణకు బాబా అంటారు - కూతురి వివాహం చేయవలసి వస్తే సాక్షిగా అయి పాత్రను అభినయించండి, లేకపోతే గొడవ జరుగుతుంది. కుమార్తెలు నిర్వికారిగా ఉండాలనుకోకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో వారి వివాహాన్ని చేయండి. పవిత్రముగా ఉండాలనుకోకపోతే పంపించేసేయాలి, విసిగించకూడదు. కుమారీ అనగా 21 కులాలను ఉద్ధరించేవారు. మీరందరూ బ్రహ్మాకుమారీలు. అందరినీ స్వర్గాధిపతులుగా తయారుచేయడమే మీ వ్యాపారము. హృదయాన్ని ప్రశ్నించుకోండి - నేను ఎంతమందిని నా సమానముగా తయారుచేస్తున్నాను? ఇది మిషన్ కదా. ఇక్కడ మీరు మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు కావున చాలా కష్టపడాలి. మీరు ఈశ్వరీయ సేవాధారులు. నేను మిమ్మల్ని దుఃఖాల నుండి విడిపించి స్వర్గాధిపతులుగా తయారుచేస్తాను. నేను నిష్కాముడను. మీకు రాజ్యాన్ని ఇచ్చి నేను వానప్రస్థములోకి వెళ్ళిపోతాను. నాకు రాజ్యం చేసే కోరిక లేదు. మీకు రాజ్యాన్ని ఇస్తాను. మీరు మీ రాజ్య భాగ్యాన్ని మళ్ళీ తీసుకోండి. మీకు తెలుసు - మనమే దేవీ-దేవతలుగా ఉండేవారము, 84 జన్మలను దాటి ఈ రోజు మనము రావణ సాంప్రదాయులుగా అయ్యాము. రావణుడిని సదా కాలుస్తూ ఉంటారు. రావణుడిని ఎప్పుడూ పూజించరు. ఎవరైతే సుఖాన్ని ఇస్తారో వారినే పూజించడం జరుగుతుంది. రావణుడి చిత్రాన్ని తయారుచేస్తారు మరియు కాలుస్తారు, అతను ఎల్లప్పుడూ దుఃఖాన్ని ఇస్తాడు. దుఃఖాన్ని ఇచ్చేవారి మహిమను ఎలా చేస్తారు? శివబాబా సుఖదాత. వారికి రోజు వెళ్ళి పుష్పాలు అర్పిస్తారు. వారి కర్తవ్యము గురించి ఏమీ తెలియదు. ఈ రోజుల్లోనైతే అంధశ్రద్ధ ఎంతగానో ఉంది.

తండ్రి అంటారు, ఎవరి ద్వారానైతే మీకు స్వర్గ సుఖము లభిస్తుందో, అటువంటి తండ్రిని మర్చిపోకండి. అలా చేస్తే మరి స్వర్గపు అపారమైన సుఖాలు లభించవు. మమ్మా, బాబా అని అన్నారు కావున స్వర్గములోకైతే వస్తారు కానీ వచ్చి పనివారిగా అవుతారు. పాట అర్థాన్ని కూడా పిల్లలు అర్థం చేసుకున్నారు. ఈశ్వరునికి చెందినవారిగా అయి ఈ బాల్యాన్ని మర్చిపోకూడదు. అసురీ సంతానము నుండి మారి మీరు ఈశ్వరీయ సంతానముగా అవుతారు, మళ్ళీ దైవీ సంతానముగా అవుతారు. ఇది ఈశ్వరీయ జన్మ. ఈ సమయంలో మీరు సేవాధారులుగా ఉన్నారు. మీరు ఆత్మిక సమాజ సేవకులు, అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈశ్వరీయ జన్మ తీసుకొని చేయకూడని పని ఏదీ చేయకూడదు. సుపుత్రులుగా అవ్వాలి. అవగుణాలను తొలగించి దేవతా గుణాలను ధారణ చేయాలి.

2. ఈశ్వరీయ సేవాధారులుగా అయి ఆత్మిక సేవ ద్వారా అందరినీ మీ సమానముగా తయారుచేయాలి. మూడడుగుల భూమిని తీసుకొని ఆత్మిక హాస్పిటల్ మరియు కాలేజీని తెరవాలి. తనువు, మనస్సు, ధనముల ద్వారా పూర్తి సహాయకులుగా అవ్వాలి.

వరదానము:- కర్మయోగిగా అయ్యి ప్రతి కార్యాన్ని కుశలత మరియు సఫలతా పూర్వకంగా చేసే చింతాముక్త భవ

చాలామంది పిల్లలకు సంపాదించాలని, పరివారాన్ని పాలన చేయాలని చింత ఉంటుంది, కానీ చింత చేసేవారు ఎప్పుడూ సంపాదనలో సఫలురుగా అవ్వలేరు. చింతను వదిలి కర్మయోగిగా అయ్యి కార్యము చేసినట్లయితే ఎక్కడైతే యోగము ఉంటుందో అక్కడ ఎటువంటి కార్యమైనా కుశలత మరియు సఫలతాపూర్వకంగా సంపన్నమవుతుంది. ఒకవేళ చింత ద్వారా సంపాదించిన ధనము వచ్చినా గానీ అది చింతనే ఉత్పన్నం చేస్తుంది మరియు యోగయుక్తులుగా అయ్యి చాలా సంతోషముతో సంపాదించిన ధనము సంతోషాన్ని ఇస్తుంది ఎందుకంటే ఎటువంటి బీజమో అటువంటి ఫలమే వెలువడుతుంది.

స్లోగన్:- సదా గుణాల రూపీ ముత్యాలను గ్రహించే హోలీహంసలుగా అవ్వండి, అంతేకానీ రాళ్ళు-రప్పలను తీసుకునేవారిగా కాదు.